కథానిక

# "దక్షిణ నాయకుడు"

"మంజుశ్రీ"

వంటయింట్లోనుంచి మధురంగా గోపికాగీతులు వినపడుతున్నాయి. "గుమ్మడేడే గోపిదేవీ, గుమ్మడేడే కన్నతల్లీ, గుమ్మడేడమ్మా" అని అత్తయ్య పాడుతున్నది. మజ్జిగ చిలుకుతున్నది కాబోలు. వేకువనే ఎప్పుడు లేస్తారో, ఎప్పుడు పాలు పితుకుతారో, ఎప్పుడు కాఫీ పెడతారో గాని మనం నిద్రలేచేటప్పటికి, "లే బావా, కాఫీ చల్లారి పోతున్నాయి, పాడునిద్ర మొద్దునిద్ర అబ్బబ్బ!" అని గొణుగుతూ తిరుగుతూంటుంది శ్రీదేవి. నాకు వినబడినా నేను లేవను. అమ్మమ్మ అప్పుడప్పుడువచ్చి "నీకేం నొప్పే లేస్తాడులే, మరీ వాకటేరొాద" అంటుంది. "సరే బాగనేవుంది, బానలోని మంచినీళ్ళు కాసినికలిపి, తడిగుడ్డ చుట్టు లేచింతర్వాత కాఫీ యియ్యి నీ మనవడికి" అని శ్రీదేవి అమ్మమ్మమీద సాధిస్తుంది. ఆమె అసలూరుకోదు. "నాకేంపనే, నీయిష్టమొచ్చినట్టు నీ మొగుడికి నీవేయిచ్చుకో" అంటుంది అమ్మమ్మ. వీళ్ళిట్లాపంతాలు పెట్టుకుంటే నా కాఫీ చెడిపోతాయేమోనని భయంతో చకామని లేచి కూచుండే వాణ్ణి. "ఇంకాసేపు ముసుగు పెట్టుకొని పండుకోవయ్యా. యీావిడగారి కోరిక నెఱవేరుతుంది" అని శ్రీదేవి చరచరయింట్లోకి వెళ్ళిపోయేది. "పిల్లది మరీ గడుగ్గాయవుతున్నది, పోయి దాని అలకేమిటో తీర్చుపో" అనేది అమ్మమ్మ గాంధీగారిలా నవ్వుతూ. అమ్మమ్మగారి పూరు పోవటమంటే భలే ఆనందం. పక్కమీదనుంచి లేచింది మొదలు పక్కమీదికి చేరేవరకూ గిల్లుకోవటాలూ గిచ్చుకోవటాలూ, మూతి విరుపులూ ముక్కువిరుపులూ.

వంట యింట్లోంచి గోపికాగీతులు వినపడుతున్నాయి. యశోదాదేవి చల్ల చిలుకుతుంటే, వెన్నున పడుకొని వెన్నుడు అడుగుతున్నాట్ట "గుమ్మడేడే కన్నతల్లీ, గుమ్మడేడమ్మా" అని. ఆ మధురభావనలో పడిపోయి ఆలోచించుకుంటున్నాను. శ్రీదేవి అప్పటికే వాకటి రెండుసార్లు పిలిచిపోయింది. ఇక పడుకుంటే బావుండదు. లేచి కాలువ గట్టువైపు వెళ్ళాను. తంగేడుపూలు విరబూచి వున్నాయి దారంట. దారిలో వేపపుల్ల ఒకటి విరుచుకొని యింటికొచ్చి బయటరగుమీద కూచున్నాను. శ్రీదేవి చెంబుతోటి నీళ్లు పెట్టి పోయింది. మొహం కడుక్కొని యింట్లోకి వెళ్ళాను. పీటమీద కూలబడ్డాను. శ్రీదేవి కాఫీ తీసుకొచ్చి యిచ్చింది. తానూ ఓ గ్లాసు తీసుకుంది. గోడకానించివున్న పీటనువాల్చి కూచోమన్నాను శ్రీదేవిని. "నే కూచోను" అంది శ్రీదేవి.

"పోనీలే, అది సరేకాని నీవు మామయ్యా అత్తయ్యావాళ్ళతో ఎందుకు తాగవు కాఫీ? శ్రీవారు లేచివచ్చిందాకా వేచియుండుటకు కారణంబే మొక్కో?" అన్నాను పోజుగా.

ఎదురింటి సుబ్బమ్మ భావిదగ్గర అమ్మమ్మతోటి ఏదో చెపుతున్నది. "ఎప్పుడూ? అట్లాగా! ఆ!" అమ్మమ్మ అడుగుతున్నది. శ్రీదేవి నేను అడిగిన దానికి సమాధాన మేమీ చెప్పకుండా పరిగెత్తింది భావిదగ్గరకు.

సుబ్బమ్మ చెపుతున్నది "గార్డుగారి పెళ్ళాం నీళ్ళాడిందట, మొగపిల్లాడట" అంతమటుకే నా కర్థమైంది. తరువాత ఏమిటేమిటో మాట్లాడుకున్నారు. నాకేమీ అర్థంకాలేదు. శ్రీదేవి వచ్చింది. "ఎంతసేపు తాగుతావు కాఫీ, ఓ గంట తాగుతావట్టుంది, బావా" అంది. "నీలాగా గొంతులో పోసుకోనులే" అన్నాను నేను. "నీ యిష్టం అయితే దొడ్లో కూచుని నీ యిష్టమొచ్చినంత సేపు తాగు. లేలే, యిక్కడ పేడేసి అలకాలి" అంది శ్రీదేవి.

"ఇందాక అడిగినదానికి సమాధానం చెప్పకుండా పరిగెత్తితివే, అది సరేలే, అమ్మమ్మకు సుబ్బమ్మ ఏమిటి చెప్పటం? ఎవరూ నీళ్ళాడింది?" అన్నాను నేను.

"విన్నావూ, వచ్చి అడక్కపోయావా, నీ కెందుకు బావా యీ ఆడముచ్చట్లన్నీ" అంది శ్రీదేవి.

"ఈసారి మొగముచ్చట్లడుగు చెబుతాను, కాలేజీపిల్లలనుగురించీ, స్నేహితులనుగురించీ చెప్ప మని వేధిస్తావే"

"మొగముచ్చట్లన్నీ ఆడవాళ్ళకక్కావాలి. ఆడ ముచ్చట్లు మొగవాళ్ళ కనవసరం, తెలుసునా?" అంది శ్రీదేవి.

"ఆడముచ్చట్లు మొగవాళ్ళ కత్యవసరం, లేక పోతే బ్రతకలేరు. నా స్నేహితులు సగంమంది ఆడవాళ్ళ ముచ్చట్లుతప్ప యింకేమీ మాట్లాడరు"

"భలే స్నేహితులు.ఏడవలేకపోయారా వాళ్లం దరూ?" అంది శ్రీదేవి.

"ఇదిగో అదిసరేగాని, ఆ సంగతేమేమిటో చెప్పవా?" అన్నాను నేను కుతూహలంతో. "అదేమిటో చెప్పకపోతే యిక్కణ్ణుంచి లేవను."

సరేఅయితే కూచో అంటూ శ్రీదేవి వెళ్ళిపో యింది. మళ్ళీ మూడు నిముషాల్లో వస్తుందని నాకు తెలుసు. వచ్చింది అలుగ్గుడ్డ తీసుకొని.

"నీమాట నీదేకాని, ఇంతలోకే ఏంపోయింది, చెబితే" అన్నాను.

"ఏముంది బావా చెప్పటానికి? ఫారెస్టు గార్డు గారి భార్య నీళ్ళాడింది-మొగపిల్లాట్ట" అదే చెప్పి పోయింది.

"అందులో విచిత్రమేముంది" అన్నాను.

"అదీ కథ, విను...మరే అనగా అనగా వో గార్డూ."

ఊఁ...

ఆ గార్డుకు ఇద్దరు పెళ్ళాలూ.

అచ్ఛా! బహుతచ్ఛా.

ఏం, అంత బాగుందేం?

చాలా బహు బాగుంది.

ఇద్దరుంటే చాలా బాగుంటుందికదు బావా?

ఆహా...యథాలాపంగా అనేశాను.

శ్రీదేవి మొహం చూశాను. "ఎబ్బెబ్బే, అంత కంటె నరక మేమన్నా వుందా, అంతకంటె అవినీతి వుందా, అంతకంటె...అంతకంటె..."

శ్రీదేవి నవ్వింది.

"మరేమో, ఆ గార్డుగారి మొదటిపెళ్ళాం పది హేను రోజులకింద పురుడుపోసుకుంది. మొగపిల్ల వాడు పుట్టాడు. రాత్రి రెండోభార్య యింకో మగపిల్లాణ్ణి కన్నదట. ఇంతముందు ఇద్దరిభార్యలకూ చెరో ఆడపిల్లే. విచిత్రంగాలేదూ! ఇద్దరూ ప్రతి దాంట్లోసమానమే. ఇద్దరినీ చెరోయింట్లో వుంచు తాడు. అందుకని సుబ్బమ్మొచ్చి బామ్మతోటి చెప్పిపోతున్నది. తమరింక లేవ్వొచ్చు..."

"అటువంటి పురుషులకు ఏమంటారో తెలు సునా శ్రీ?"

"ఏమంటారేమిటి?"

"దక్షిణనాయకులని పిలుస్తారు." "అంటే ఏమిటీ" అడిగింది శ్రీదేవి. అంటే నాకూ తెలీదు. శ్రీకృష్ణుడు పర్‌ఫెక్టు అంటే అసలైన సిసలైన దక్షిణనాయకుడు, "ఏయే వేళల నేసరోజముఖి, ఏయేలీలలంగోరు తానాయావేళల, నా సరోజ ముఖి నాయాలీలలందేల్చి" చరించేవాడట కృష్ణుడు. అందుకని ఆయనను "దక్షిణనాయకుడు" అన్నారు. ఇద్దరు భార్యలుంటే హెచ్చుతగ్గులు లేకుండా సమానమైన ప్రేమాదరాలను చూపించే భర్తను దక్షిణనాయకుడంటారు. మరి మన ఫారెస్టుగార్డు శ్రీకృష్ణపరమాత్మకన్నా గట్టి దక్షిణ నాయకు డన్నమాట."

"తమరుకూడా అవుతారా?" అంది శ్రీదేవి.

"ఈ యింట్లో యిద్దరు శ్రీదేవులుంటే అయ్యే వాణ్ణి. ఇప్పుడు కాలేను."

శ్రీదేవి నవ్వింది.

"ఇంకపో బావా! బయట పుస్తకాలు పార జూస్తున్నాయి. మళ్ళీ భోజనానికి పిలిచిందాకా వాటినితింటూ వుండుపో."

"నేను కాసేపు నీ ముందుండటం నచ్చదన్న మాట. రేప్రొద్దుటే వూరికెళతాలే అయితే."

"వెళ్ళండిసార్, ఇప్పుడు నేనేం మీకోసం బెంగపెట్టుకోను. మూడునెలలు శలవలిస్తే పరిగెత్తు కుంటూ మీరే వస్తారు."

"నేనురాను యీసారి చూసుకో."

"అయితే నేనే వస్తానులే బావా! ప్రతిదానికీ నీకు తెగకోపం."

"నాకేం కోపంలేదమ్మాయోయ్, నీకే ఎక్కువ కోపం" అన్నాను నేను.

"ఇప్పుడు బామ్మ వచ్చిందంటే చప్పున కోప తాపాలసంగతి తెలుస్తుంది. గార్డుగారి ముచ్చట

చెప్పలేదనేగా యీ రభస. మధ్యాహ్నం నా వెంట రా. గార్డుగారింటికి తీసుకపోయి, అందరినీ పరిచయం చేస్తాను. ఆయనతోటి చెబుదువుగాని యిందాకచెప్పిన ఉపన్యాసమంతా!" శ్రీదేవి ముఖభంగిమచూస్తే నాకు నవ్వాగలేదు.

"బావా! తాగిన కాఫీ కాసిని నాతోటి పోట్లాడటంతో సరిపోయినాయి. ఇక వెళ్ళండి సార్ గారూ నాన్నగారొచ్చేటైమైంది."

శ్రీదేవి బుగ్గమీద చిటికేశాను.

చిరుకోపం నటించింది.

గిరుక్కున తిరిగి పంచలోకి వెళ్ళబోతుంటే అత్తయ్య కనబడ్డది.

అత్తయ్య చూసినట్టు అనుమానమేసింది.

చూస్తే చూడనీలే అనుకున్నాను.

---

స్కెచ్

# సంజీవయ్య సంధ్యాస్వప్నం

"పూ భా"

సంఘమూ, ప్రభుత్వమూ నిర్మించిన శాసనాల వల్ల ఎన్నో తీరనికోరికలూ, బయటకు వ్యక్తపరచరాని అభిప్రాయాలూ, ప్రతి మానవ హృదయంలో దాగి ఉంటాయి. వీటి ఫలసిద్ధికి వాస్తవికజగత్తులో అవకాశం లేదుకాబట్టి స్వప్న జగత్తు వీటి అనుభూతిని ప్రసాదిస్తుంది.

మకరసంక్రాంతి సాయంత్రాన్ని రాత్రి కౌగలించుకుంటోంది. ప్రజాసౌకర్యార్థం వెయ్యబడ్డ వీధి ఎలక్ట్రిక్ దీపం వెలిగింది. గదికిటికీదగ్గర మడత మంచంమీద పడుకున్న సంజీవయ్య ముఖంమీద కిటికీ గజాల సందుల్లోంచి వచ్చిన వీధిదీపం వెలుగు పడుతోంది.

వీధిలోంచి ఎన్నికల ప్రచారాల సంఘాలు ఓట్లకోసం నినాదాలు చేసుకుంటూ వెళ్ళిపోతున్నాయి.

"పలుతావుల్ వెదజల్లు తెమ్మెరలు పైపైడాయ, రేరాజు వెన్నెలకాయ..."

ఎప్పుడో ఎందుకోచదువుకున్న పద్యం జ్ఞాపకం వచ్చింది సంజీవయ్యకి.

లేచి బయలుదేరాడు.

పెద్దపార్కూ, రకరకాల చెట్లూ, వాటి పువ్వులూ, వాటి వాసనలూ—

మీదని చల్లని తెల్లని వెన్నెలా—

క్రిందని పరచిన రత్నకంబళిమల్లే మెత్తని పచ్చని గడ్డీ—

కూర్చుండికి అమర్చిన బెంచీలూ—

రంగురంగుల దీపాలకాంతితో జలయంత్రం కురిపిస్తున్న యింద్రధనస్సు జలధారలూ—

వీటన్నింటినీ గడచి నడచిపోతున్నాడు సంజీవయ్య.

బీచికి వచ్చాడు. జనం కిటకిటలాడుతున్నారు. చోటుచూసుకుని సముద్రానికి ఎదురుగా ముఖం పెట్టి కూర్చున్నాడు. సముద్రతరంగాలు ఎగిరెగిరి విరిగి నురగలు కక్కుతున్నాయి.

"యూ కమ్ హియర్" అని వినిపించింది.

వెనక్కితిరిగి చూసాడు.

ఎవరో వ్యక్తి—

"ఏం అలా గుడ్లు మిటకరించుకు చూస్తున్నావ్? నేనెవరో కనిపించలేదూ? సెల్యూటైనా చేసావు కావ్. ఎంతపొగరు!" అన్నాడు ఆ వ్యక్తి.

"ఎవరుమీరు? మర్యాదగా మాట్లాట్టం చాత కాదూ?"

"అంతవరకూ వచ్చిందీ! యిదుగో నీ పెర్సనల్ రికార్డు. యిప్పుడైనా తెల్సిందా నేనెవరో? నీ ప్రాణాలు నా చేతిలోఉన్నాయి."

"అయితే నువ్వు యముడివన్నమాట"

"నోర్మూయ్"

"ఎందుకు ముయ్యాలి?"

"నేను నీ అధికారిని. నువ్వు నా బానిసవు. నేనేమన్నా నువ్వు పడాల్సిందే"

"అదా సంగతి! ఆ లెక్కకొస్తే నేనేకాదు నువ్వుకూడా బానిసవే. నీకూ నాకూ ఒక్కసంస్థే